


## తలవంచని సాహిత్యం

# అన్నమయ్య పదాలు సామాజిక దృక్పథాలు

ఏ విద్యా కుసుమాలకైనా ప్రోత్సాహం, సరైన ఆదరణ లభిస్తే దాని పరిమళాలు సర్వ దిశలా వ్యాపిస్తాయనడంలో సందేహం లేదు. ముఖ్యంగా సాహిత్యాన్ని పోషించాడానికి కొండంత భాషాభిమానమేకాదు, లోతైన భావ పరిజ్ఞానం కూడా అవసరం. ముఖ్యంగా పాలించే ప్రభుత్వాలైనా, రాజులైనా ఈ సృజనాత్మకతని ప్రోత్సహిస్తే ఈ సాహితీ మకరందాలు కలకాలం ప్రజలకి అందుతాయి. అందుకేనేమో ఒక కావ్యంలో సృజన గుర్తించలేని ప్రజల చేత నా సాహిత్యాన్ని చెదివించేలా చేయ వద్దని అల్లసాని పెద్దన సరస్వతీ దేవిని వేడు కొన్నాడు. సంగీతమైనా సాహిత్యమైనా ప్రజల మెప్పు ద్వారానే విలసిల్లుతాయి. పాలకులకూడా తమవంతు సాయం అందించాలి. లేకపోతే ప్రపంచంలో ఏ భాషైనా తన మనుగడ, ఉనికిని కోల్పోయే పరిస్థితి వస్తుంది. ఒక్కసారి చరిత్ర తట్టి చూస్తే విజయ నగర రాజుల కాలంలో తెలుగు సాహిత్యం వికసించినట్లుగా ఏ రాజుల పరిపాలన లో జరగలేదేమో! క్రీ. శ 1440 ప్రాంతంలో విజయనగరాన్ని సాళువ నరసింహరాయలు పరిపాలించేవాడు. అతను కూడా సాహితీ పిపాసి. అన్నమాచార్య పద సాహిత్యం గురించి విని, విజయ నగరం రమ్మనమని అహ్వానం పంపాడు. అన్నమయ్య కారణాంతరాల వల్ల విజయ నగరం వెళ్ళలేక పోయాడు. నరశింహరాయల విజయ నగరంలో నివాసం ఉన్నా, తరచు పెనుగొండ లో కూడా ఉండేవాడు.

ఒకసారి అన్నమయ్యను పెనుగొండ పిలిపించుకొని పదసాహిత్యం విని మైమరచి పోయాడు. అన్నమయ్యని సత్కరించాడు. కానుకలూ అభరణాలూ అగ్రహారాలూ కానుకగా ఇచ్చాడు. ఒకసారి వేంకట పతి మీద అలకించిన శృంగార కీర్తన విని గర్వాంధుడై వేంకటపతి మీది పదముల వంటి పదములు తనమీద కూడా చెప్పమని అన్నమయ్యని కోరాడు. అది విని అన్నమ య్య హుతాశుడై " హరి ముకుందుని గొనియాడు నా జిహ్వ నినుగొనియాడగ నేర" దని ఒక పదం చెప్పాడు. తరువాత అన్నమయ్య బందీగా చెరసాల అనుభవించడం అందరికీ తెలుసున్న కథే! హరిని తప్ప సామాన్య మానవులను స్తుతించనని రెండు మూడు పదాలు రాసాడు. అదే సమయంలో అన్నమయ్య దాదాపు అదే భావం స్ఫురించేలా వేరే కీర్తనలూ రాసాడు.

తలగరో లోకులు తడవకురో మమ్ము
కలగిన దిదె మా కాపురము //పల్లవి//

నరహరి కీర్తన నానిన జిహ్వ
ఒరుల నుతింపగ నోపదు జిహ్వ
మురహరుపదముల మ్రొక్కిన్గ్ శిరము
పరుల వందనకు బరగదు శిరము //తల//

శ్రీపతినే పూజించిన కరములు
చోపి యాచనకు జొరవు కరములు
యేపున హరికడ కేగిన కాళ్ళు
పాపుల ఇండ్లకు బారవు కాళ్ళు //తల//

శ్రీవేంకటపతి జింతించు మనసు
దాపతి నితరము దలచదు మనసు
దేవుడతని యాధీనపు తనువు
తేవల నితరాధీనము గాదు //తల//

దేవుడికీ తనకీ మధ్య ఉన్న సంబంధ బాంధవ్యాన్ని ఒక విడదీయలేని అత్మీయతతో పోల్చాడు అన్నమయ్య. ఎల్లవేళలా తననోట హరినామా సంకీర్తన తప్ప వేరుకరి స్తుతి పలకదు. నరహరికీర్తనలతో నానిన నాలుక వేరొకరి భజన చేయలేదు. మొరహరికి మొక్కిన తల ఇతరుల వందనకు తలవంచదు. . శ్రీపతిని మొక్కే ఈ చేతులతో ఇంకొకరి ప్రాపకం కోసం యాచన చేయగలావా? ఏడు కొండలు ఎక్కినా అలవని కాళ్ళు అధముల ఇంటి వైపు అడుగు కూడా వేయలేవు.. ఎల్లవేళా శ్రీవేంకటపతిని తలచే మనసు కానుకల కీ, బెదిరింపులకీ తల వంచదు. అంటూ ధైర్యంగా ఎంతో గుండె నిబ్బరంతో నరసింహ రాయల మాటలు తిరస్కరించి బందీగానే గడిపాడు తప్ప, ఒక్క పదం కూడా పరుల భజనకి వాడలేదు. మనిషి తప్పు చేస్తే భయపడాలి గానీ శిక్షిస్తారనీ భయపడి సరస్వతిని అమ్ముకోవడం సబబా? అని పాలించే ప్రభువులని ధిక్కరించడం అంత సులువైనది కాదు. అలా చేయాలంటే ఎంతో మనో నిబ్బరంతో కూడిన ధైర్యం కావాలి.

తరువాత అందుకే అన్నమయ్యకి తలవంచాడు నరసింహరాయలు. ఎంతో మంది కవులు ప్రభువులనీ పాలించే దొరలనీ పొగడ్తల సాహిత్యంతో ముంచెత్తిన సంఘటనలు అనేకం ఉన్నాయి. కేవలం మహరాజుల ప్రీతి పాత్రులవడంకోసం కావ్య స్తుతి చేసిన కవులూ ఉన్నారు. వారందరిలో అన్నమయ్య అజరామరుడు. తెలుగు సాహిత్యంలో భాగవతం రాసిన పోతన కూడా తన సాహిత్యాన్ని వెల కట్టలేనని విలవిల లాడేడు తప్ప, మరణానికీ భయపడకుండా శిక్షలకు తలవంచకుండా జీవించారు . అందుకే చరిత్రలో ఓ అన్నమయ్య పేరూ, ఓ పోతనామాత్యుడి గురించీ, ఓ త్యాగయ్య గురించీ ఇప్పటికీ చెప్పుకుంటున్నాం. ముందుతరాలు కూడా చెప్పుకుంటారు. తను నమ్మిన విలువలకోసం నిలబడే ఏ కవి సాహిత్యమైనా కలకాలం నిలుస్తుందనడంలో ఎవ్వరికీ సందేహం ఉండదు., ఉండకూడదు కూడా !

